సాక్షి సూర్యాపేట

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



చెర్వుగట్టు.. జనసంద్రం

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో



ముగిసిన కబడ్డీ టోర్నమెంట్

చింతలపాలెంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ ముగిసింది. - 8లో



స్వస్తివాచనంతో శ్రీకారం

పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

28న వైస్ చైర్మన్ ఎన్నిక

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఈనెల 28న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ రోజు కుదరకపోతే మరుసటి రోజు ఎన్నిక నిర్వహించాలని పేర్కొన్నారు. ఈనెల 24లోగా మున్సిపల్ సభ్యులకు ఫామ్ 3 నోటీసుల ఇవ్వాలని సూచించారు.

క్యాంటీన్, జిరాక్స్ సెంటర్లకు అద్దె ఎంత?



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కలెక్టరేట్ భవనంలో క్యాంటీన్ కేటాయింపు విషయంలో విమర్శలు వస్తున్నాయి. క్యాంటీన్ కేటాయింపు పారదర్శకంగా జరగలేదని ఆరోపణలు ఉండగా ఇది 5 నెలలుగా కొనసాగుతున్నా నేటికీ అద్దె చెల్లించడం లేదని సమాచారం. ఇందుకు ప్రధాన కారణం నేటికీ క్యాంటీన్‌కు అద్దె ఫిక్స్ కాలేదని తెలుస్తోంది. అదే విధంగా ఇటీవల కలెక్టరేట్‌లో జిరాక్స్ సెంటర్‌కు కూడా గది కేటాయించడం.. దీనికి అద్దె ఫిక్స్ చేయకపోవడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. సంవత్సరాల కాలం లీజ్ ప్రాతిపదికన క్యాంటీన్, జిరాక్స్ సెంటర్లు కేటాయిస్తే... వీటి నిర్వహణకు అర్హులు, ఆశావహుల నుంచి టెండర్ పిలువాల్సిన అవసరం ఉందని అంటున్నారు. కానీ ఇక్కడ ఎలాంటి టెండర్ లేకుండా ఏక పక్షంగా కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇటీవల క్యాంటీన్ ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది.

మోదీ విధానాలతో ఆర్థిక అసమానతలు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలతో దేశంలో తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. సోమవారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధర చట్టం కోసం ఢిల్లీలో రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్రం అణిచివేయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తో తలెత్తే పర్యావరణ సమస్యలపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంతాన్ని సోమవారం డీఐజీ చౌహాన్, ఎస్పీ చందనాదీప్తి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్లాంట్‌లో పనులు నిలిచిపోవడానికి దారితీసిన పరిస్థితులు, కారణాలతో పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిసింది. ఇంటలిజెన్స్ నివేదికల తర్వాతే ప్లాంట్‌లో పనుల నిర్వహణపై ప్రభుత్వం స్పందించే అవకాశం ఉందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రస్థాయి డ్రామా పోటీలకు ఎంపిక

రామగిరి(నల్లగొండ) : ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం(ఎల్టా), ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా 8, 9వ తరగతి విద్యార్థులకు ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి డ్రామా పోటీలను సోమవారం డైట్ కళాశాలలో నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి ఆరు టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జెడ్పీహెచ్‌ఎస్ కొలనుపాక, (యాదాద్రి భువనగిరి), కేజీబీవీ తిరుమలగిరి, (సూర్యాపేట) విజేతలుగా నిలిచాయి. ఈ టీమ్‌లను ఈనెల 26 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు.

కూరెళ్ల గ్రంథాలయం ప్రారంభం





రామన్నపేట మండలం వెల్లంకిలో ఆచార్య కూరెళ్ల నూతన గ్రంథాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్, సినీగేయ రచయిత చంద్రబోస్

కోలాహలం.. మినీ మేడారం

ఉమ్మడి జిల్లాలోనూ పలుచోట్ల సమ్మక్క-సారలమ్మ జాతరలు

- భారీగా తరలిరానున్న భక్తులు.. ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- జాతర సందర్భంగా పెన్‌పహాడ్‌లో మహిళలకు కోలాటం పోటీలు
- రాజాపేట, గుండాల, పెన్‌పహాడ్, పెద్దవూర మండలాల్లో చిన్న జాతర

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: గిరిజనుల ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా భావించే సమ్మక్క సారలమ్మల జాతర ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ నాలుగు రోజులు పాటు అంగరంగ వైభవంగా సాగనుంది. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో మహిళల కోలాటం పోటీలతో కోలాహలంగా జాతర జరుగనుంది. దాంతోపాటు రాజాపేట, గుండాల, పెద్దవూరలో ఈ నెల 21వ తేదీ నుంచి ఈ జాతరలను నిర్వహించేందుకు నిర్వాహకులు, యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గద్దెలకు సారలమ్మ ఆగమనంతో జాతర మొదలు కానుండగా, 24వ తేదీ సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశంతో జాతర ముగియనుంది. ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల జరిగే జాతరలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులను కల్పించేందుకు జాతర నిర్వహణ కమిటీలు, స్థానిక యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

వేలల్లో రానున్న భక్తులు

ఆలేరు నియోజకవర్గంలోని రాజాపేట మండలం బూర్గుపల్లి - కుర్రారం గ్రామాల మధ్యలో చిన్న మేడారం, చల్లూరులో యాదాద్రి మేడారం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ చిన్న మేడారానికి 50 వేలకు పైగా భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. చల్లూరు లక్ష్మక్కపల్లిలో ఈ ఏడాది నుంచే సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం గద్దెలను సిద్ధం చేశారు.

◆ గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 21వ తేదీన సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు. 22వ తేదీన సమ్మక్కను తీసుకువస్తారు. ఆరోజు నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివస్తారు. 22, 23 తేదీల్లో, 24వ తేదీన వన ప్రవేశం వరకు భక్తులు అమ్మవార్లను దర్శనం చేసుకొని, ముడుపులు చెల్లిస్తారు. ఈ జాతరకు 10 వేలకు పైగా భక్తులు హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు.

◆ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర మండలం పొట్టిచెల్మ క్రాస్‌రోడ్డు వద్ద నాగార్జునసాగర్- హైదరాబాద్, నల్లగొండ-మాచర్ల ప్రధాన రహదారుల కూడలిలో కొలువై ఉన్న సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన పూజారులు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగజ్యోతి తెలిపారు. దాదాపు 10 వేల మంది హాజరవుతారని అంచనా. 20 ఏళ్ల కిందట నుంచి ఇక్కడ జాతర నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు పరిసర గ్రామాల ప్రజలే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి ముడుపులను చెల్లిస్తారు.



పెద్దవూర మండలం పొట్టిచెల్మ సమీపంలో సమ్మక్క సారలమ్మ గద్దె వద్ద భక్తుల పూజలు



పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురంలో ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ గద్దెలు

కోలాటం పోటీలు ప్రత్యేకం

పెన్‌పహాడ్ మండలం గాజులమల్కాపురంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయిలో మహిళల కోలాటం పోటీలను నిర్వహించడం ప్రత్యేకత. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ఏలూరు, మచిలీపట్నం, రాజమండ్రి, నందిగామ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతరకు నాలుగు రోజుల్లో దాదాపు 20 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని దేవాలయ, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

కోదాడఅర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సూచించారు. సోమవారం విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కోదాడలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను , బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించేందుకు అన్ని ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన తర్వాత పాఠశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. పాఠశాలల నిర్వహణ విధానాన్ని మెరుగుపరుచుకోవాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. కాగా పాఠశాలల్లో స్కావెంజర్లు లేక పారిశుద్ధ్యం కుంటుపడుతున్నదని, తక్షణమే వారిని నియమించాలని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో సలీం షరీఫ్, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఐదు మండలాలకు కలిపి ఒకే ఎంఈఓ ఉండటంతో పాఠశాలలను మానిటరింగ్ చేయడం కష్టంగా ఉందని, ప్రతి మండలానికి ఒక ఎంఈఓను నియమించాలని ఆయన దృష్టి వారు తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు స్కావెంజర్లు, ఎంఈఓల నియామకంపై ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, విద్యాశాఖ సమీక్ష అనంతరం వీటిపై కార్యాచరణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ విజయలక్ష్మి, సూర్యాపేట, నల్లగొండ డీఈఓలు కె. అశోక్, భిక్షపతి, డీఐఈఓ ఎస్‌ఓ శ్రావణ్‌కుమార్, కోదాడ ఎంఈఓ ఎం. డీ.సలీం షరీఫ్ తదితరులు ఉన్నారు.



కోదాడ బాలికల ఉన్నత పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న బుర్రా వెంకటేశం

జూనియర్ కళాశాల తనిఖీ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం తనిఖీ చేశారు. అధ్యాపకుల హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఎన్విరాన్మెంట్ పరీక్షను తనిఖీ చేశారు. ఆయన వెంట డీఐఈ ఓ కృష్ణయ్య, యాదయ్య ఉన్నారు.

క్రీడలు సమైక్యతను చాటుతాయి

గరిడేపల్లి: క్రీడలు సమైక్యతను చాటుతాయని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని అరవింద ధ్యాన మందిరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ కబడ్డీ పోటీలను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. మారుమూల గ్రామంలో జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వర్‌రావును అభినందించారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలను చెందిన ఎంపిక చేసిన కబడ్డీ టీములు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల నిర్వాహకులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో క్రీడలపై ఆసక్తి పెరిగేలా పోటీలు నిర్వహించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆటల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి ఆటల పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ జాతీయ మహిళా కబడ్డీ పోటీల్లో హరియాణా గురుకుల, పానిపట్టు, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు సుందరి నాగేశ్వరరావు, భూలోకరావు తెలిపారు. మొదట ఎస్పీ రాహుల్ హెగ్డే జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల స్రవంతిశోభన్‌బాబు, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, గరిడేపల్లి ఎస్‌ఐ ఈట సైదులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు ఆంధ్రా సరిహద్దు ఉండటంతో గంజాయి అక్రమ రవాణాకు అవకాశాలు ఉన్నాయన్నారు. నిఘా పెరగడం, కేసులు నమోదు చేస్తుండటంతో గంజాయి రవాణాకొంత తగ్గినట్లు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, గరిడేపల్లి, నేరేడుచర్ల ఎస్‌ఐలు ఈట సైదులు, రవీందర్‌నాయక్, ఏఎస్‌ఐ రాములు నాయక్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

ప్రజావాణిలో అధికారులు విధిగా పాల్గొనాలి

- కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో జిల్లా అధికారులు విధిగా పాల్గొనాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలకు అందిన 319 దరఖాస్తుల్లో 215 పరిష్కరించామని, ,104 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని వివరించారు. ఈ ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించిన 24 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 37 ఇలా మొత్తం 51 అర్జీలు అందినట్లు తెలిపారు. వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ దుబారా కాకుండా చూడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది డేటా ఎంట్రీ త్వరితిగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు , డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీటీడీఓ శంకర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈనెల 28 నుంచి మార్చి19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని 77 కాలేజీలకు చెందిన 16,602 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలను 9 జోన్లుగా విభజిస్తూ, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 3 టీంలు సిట్టింగ్ స్క్వాడ్స్, 850 మంది ఇన్విజిలేటర్‌లను నియమించామన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డి తో కలిసి పాల్గొని మాట్లాడారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 67 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 345 ఉన్నత పాఠశాలల్లో ఉన్న రెగ్యులర్ విద్యార్థులు 11,946 మంది, ప్రైవేట్ విద్యార్థులు 187 మంది మొత్తం 12,133 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

మార్చి 3న చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 0-5 పిల్లలు 92,965 మంది ఉన్నారని 774 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జెడ్పీసీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, వైద్యాధికారి కోటాచలం, డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఖరారు

- జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్లు
- త్వరలోనే కొత్త పాలక వర్గాల నియామకం
- పదవీకాలం మూడేళ్లు

తిరుమలగిరి (తుంగతుర్తి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలో ఆరు మార్కెట్లు ఉండగా రెండు ఓసీ జనరల్, రెండు ఓసీ ఉమెన్, ఒకటి బీసీ ఉమెన్, ఒకటి ఎస్సీ ఉమెన్‌కు కేటాయించారు. కొత్త రిజర్వేషన్ల ప్రకారమే నూతన పాలకవర్గాలు త్వరలో కొలువుదీరనున్నాయి.

ఇవీ మార్గదర్శకాలు..

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ చట్టం 1906 సెక్షన్ 5 (1) ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతి మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది.

12 మంది రైతులు..

❖ మార్కెట్ కమిటీ పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణన ఉత్పత్తిదారులు. (వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ అల్ప సంఖ్యాక (మైనార్టీ) వర్గాలు , మహిళలు ఉండాలి)

❖ కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు.

❖ ఎక్స్ అఫీషియో సభ్యులు నలుగురు. (వీరిలో మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్‌ల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచ్ ఒకరు ఉండాలి.)

❖ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించ వచ్చు.

రిజర్వేషన్లు ఇలా..

సూర్యాపేట	- ఓసీ జనరల్
తిరుమలగిరి	- ఓసీ ఉమెన్
తుంగతుర్తి	- ఓసీ జనరల్
కోదాడ	- ఎస్సీ ఉమెన్
హుజూర్‌నగర్	- ఓసీ ఉమెన్
నేరేడుచర్ల	- బీసీ ఉమెన్



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కొత్త మార్గదర్శకాల ప్రకారం..

ప్రభుత్వం ఇచ్చే నూతన మార్గదర్శకాల ప్రకారం కొత్త మార్కెట్ కమిటీలు ఏర్పాటవుతాయి. ఇప్పటి వరకు కొత్త కమిటీల ప్రతిపాదనలు రాలేదు. వచ్చిన తరువాత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

– శ్రీధర్, మార్కెట్ కార్యదర్శి, తిరుమలగిరి

ఇప్పటి నుంచే పైరవీలు

వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే నూతన పాలక వర్గాలు ఏర్పాటు చేస్తామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఏడాది పాటు ఉండే పాలక వర్గ పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలకు పెంచారు. తాజాగా ఆరు నెలలు రెండుసార్లు పదవీ కాలాన్ని పెంచాలనే నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పుడు వచ్చే పాలక వర్గ పదవీ కాలం మూడు సంవత్సరాల వరకు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, తుంగతుర్తి, హుజూర్‌నగర్, నేరేడుచర్లలో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. జిల్లాలో రిజర్వేషన్లు ప్రకటించిన నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు పదవుల కోసం ఇప్పటి నుంచే పైరవీలు మొదలు పెట్టారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల తనిఖీ

- విద్యార్థుల సామర్థ్యాల అంచనాకు ప్రత్యేక కార్యాచరణ
- 30 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రక్రియ
- 21వ తేదీలోపు ముగింపు

చిలుకూరు: పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈనేపథ్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల నమోదు పరిశీలనకు శ్రీకారం చుట్టింది. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఇంటర్నల్ మార్కులు వేసే విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది.



చిలుకూరులో ఇంటర్నల్ మార్కులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

వాస్తవాలు పరిశీలించడానికే..

ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు ఉండగా 80 మార్కులకు వార్షిక పరీక్ష ఉంటుంది. మిగిలిన 20 మార్కులకు నాలుగు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ ఫలితాలు , విద్యార్థులు రాసే రికార్డుల ఆధారంగా మార్కుల కేటాయింపు ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌లో వాస్తవంగా మార్కులు వేశారా లేదా అన్న విషయాన్ని ఈ బృందాలు పరిశీలించనున్నాయి. లోపాలుంటే సరిచేసిన తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

ఒక్కో బృందానికి 5నుంచి 7 పాఠశాలలు

జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు 184, ప్రైవేట్ పాఠశాలలు 121, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు 50 ఇలా మొత్తం 355 పాఠశాలల్లో 11,946 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలలను తనిఖీ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 30 ప్రత్యేక బృందాలను జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో జీహెచ్‌ఎమ్ గానీ, ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయుడు గానీ, ఒక లాంగ్వేజ్ పండిట్, మరో నాన్ లాంగ్వేజ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కో బృందానికి 5 నుంచి 7 పాఠశాలల తనిఖీ బాధ్యతలను అప్పగించారు. మార్చి మొదటి వారంలో ప్రీఫైనల్ పరీక్షలు ఉన్నందున ఈ నెల 21వ తేదీలోపు ఈ తనిఖీ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో ఓ గొర్లకాపరి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జానగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పదిరె సాయి మల్లయ్య(40) గొర్లను కాయడంతో పాటు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లయ్యకు రాజాపేట మండలం బొందుగుల రెవెన్యూ పరిధిలో కొంత వ్యవసాయ భూమి ఉంది. మల్లయ్య కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే మల్లయ్య సోమవారం తన వ్యవసాయ బావి వద్దకు వచ్చి ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమెతో పాటు ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే వ్యవసాయ బావి వద్దకు రాగా అప్పటికే మల్లయ్య చెట్టుకు విగతజీవుడిగా వేలాడుతుండడంతో లబోదిబోమన్నారు. రాజపేట ఏఎస్‌ఐ మైసయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి మల్లయ్య ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు చొప్పున కుమార్తెలు, కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మల్లయ్య భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడు మృతి

నాంపల్లి: రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. నాంపల్లి మండలంలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన కొరె మహేష్ (25) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామంలోని ఓ శుభకార్యంలో పాల్గొని బైక్‌ను పసూన్నర్ గ్రామంలో ఇవ్వడానికి బయలుదేరాడు. పసున్నూర్‌లో ఓ కార్యానికి హాజరైన చింతకాయల శంకర్ పెద్దాపురం గ్రామానికి బైక్‌పై వస్తుండగా పెద్దాపురం శివారులో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మహేష్‌ను నల్లగొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని తెలిపారు. మృతుడి తల్లి కొరె యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

చెర్వుగట్టు.. జనసంద్రం

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాల మహోత్సవం
- నిప్పుల గుండంలో నడిచి.. మొక్కు చెల్లించుకున్న భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ

నార్కట్‌పల్లి : హరహర మహదేవ.. శంభో శంకర నామస్మరణం చెర్వుగట్టులో మార్మోగింది. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలు అశేష భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారు జామున అగ్నిగుండాల ఘటాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చకులు సతీష్ శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేష్, సిద్దుశర్మల మంత్రోచ్ఛరణల నడుమ గరుడ వాహనంపై స్వామి వారితో పాటు ఇరమూస్తి వార్ల ప్రభను అగ్నిగుండం వరకు తిసుకొచ్చారు. ఉత్సవాల్లో మరో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేషభక్తులు స్వామివారి నామస్మరణ చేసుకుంటూ అగ్నిగుండంలో నడిచి మొక్కు చెల్లించుకున్నారు. బందోబస్తు నిర్వహణకు వచ్చిన పోలీసులు కూడా అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు.


చెర్వుగట్టుపై భక్తజన సందోహం, అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు


చెర్వుగట్టులో అగ్నిగుండంలో ప్రభతో నడుస్తున్న భక్తులు


శివ సత్తుల విన్యాసాలు

శివసత్తుల ప్రత్యేక పూజలు

స్వామివారి అగ్నిగుండాల కార్యక్రమానికి శివసత్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోనాలు ఎత్తుకుని విన్యాసాలు ప్రదర్శిస్తూ.. ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. అగ్నిగుండంలో నడిచి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.

భారీ పోలీసు బందోబస్తు

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐలు నాగరాజు, రాఘవరావు, ఎస్‌ఐలు అంతిరెడ్డి, సైదాబాబు, రామకృష్ణతో పాటు దాదాపు 300 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, కార్యనిర్వహణ అధికారి నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 60,580

నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.60,580 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు.

స్వస్తివాచనంతో శ్రీకారం


ఆలయ ముఖ మండపంలో స్వస్తి వాచనం పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

- యాదాద్రిలో ప్రారంభమైన పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు
- నేడు ధ్వజారోహణము, భేరీ పూజ

యాదగిరిగుట్ట: ఆలయ మూలవర్యులకు నిజాభిషేకం.. విశ్వక్సేన ఆరాధన.. జలపూజ.. ఉత్సవ నిర్వాహకులకు కంకణ ధారణతో స్వస్తి వాచనం, పుట్టమట్టిలో నవధాన్యాలను నాటడంతో అంకురారోపణము.. ఇవి పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల తొలి రోజు వైభవాలు. సోమవారం ఆలయంలో నిత్యారాధనలు అనంతరం ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, పారాయణికులు పంచరాత్రాగమ శాస్త్రానుసారంగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ తొలి పూజల్లో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు పాల్గొన్నారు.

విశ్వక్సేన ఆరాధన

స్వామివారి బ్రహ్మోత్సవాల ఆరంభమున చరాచర జగత్తు అంతా భగవానుని కటాక్షముతో శుభములు పొందాలని, ఉత్సవ పరిసమాప్తి వరకు ఎలాంటి ఆటంకములు జరగకూడదని స్వస్తి వాచన మంత్రములతో.. విశ్వక్సేనారాధనతో పూజలు చేపట్టారు. ఈ పూజలతో భగవానుని ప్రార్థించడమేనని ఆచార్యులు పేర్కొన్నారు.

రక్షాబంధనం

ఆగమ శాస్త్రానూసారంగా జగద్రక్షకుడైన పరమాత్మను ఆరాధన గావించి స్వామి, అమ్మవారికి రక్ష బంధన వేడుక చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులు కూడా ఈ రక్ష బంధనాన్ని ధరించి భగవంతుడి అనుగ్రహం పొందారు.

పుణ్యహావచనం

మూలవరులకు, ఆలయ పరిసర ప్రాంతాల్లో పుణ్యహావచన మంత్ర జపమును సంప్రోక్షణ గావించారు. కల్యాణ సంభారములు, స్థల ద్రవ్య, శుద్ద్యర్థం శుద్ధి పుణ్యాహ వాచన కైంకర్యము నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో అంకురారోపణం, మృత్స్యంగ్రహణం నిర్వహించారు. ఆలయం నుంచి తిరువీధుల గుండా మండపానికి చేరుకున్నారు. అక్కడ భూమాతను పూజించి, మృత్తికను (మట్టిని) సేకరించారు. తిరిగి ఆ మృత్తికను ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన పాలికలలో నింపి, వాటిలో నవధాన్యములు చల్లారు.

ఉత్సవాల్లో నేడు

స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, వేద పారాయణం నిర్వహిస్తారు. సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వానం జరిపిస్తారు. ధ్వజ రోహనం జరిగే సమయంలో ఆచార్యులు ధ్వజస్తంభం వద్దకు వచ్చి పూజలు నిర్వహిస్తారు.


స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ప్రధానార్చకులు


ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గురుకుల విద్యార్థినుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాలమహానాడు తెలంగాణ రాష్ట్రకమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్, కేవీపీఎస్ సూర్యాపేట ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకులు బోడ శ్రీరాములు డిమాండ్ చేశారు. విద్యార్థినుల మరణాలపై సమగ్ర విచారణ జరిపి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో నలుగురు విద్యార్థినులు అఘాయిత్యానికి పాల్పడడం బాధాకరమన్నారు. ఈ ఘటనలపై పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. మరణించిన విద్యార్థినుల కుటుంబాల కు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆయా కుటుంబా ల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశా రు. ప్రతి హాస్టల్ లోవిద్యార్థులకు సైక్రాటిక్ డాక్టర్ గారితో కౌన్సిలింగ్ నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ హాస్టల్స్ సందర్శించి సమస్యలు తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బోయిల అఖిల్, నాగేందర్ నాయక్, వల్లపట్ల దయానంద్, ఏడిండ్ల అశోక్, మామిడి స్టాలిన్, వెంపటి నాగమణి, సమతా సైనిక్, అనుములపురి రామకష్ణ, మల్లేష్,ఎడ్ల కళ్యాణ్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కుటుంబ కలహాలతో బలవన్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

కనగల్ : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కనగల్ మండలంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి గ్రామానికి చెందిన ఆదిమల్ల శ్రీకాంత్(27) తన భార్య మౌనికతో గొడవపడడంతో ఈ నెల 12న పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీకాంత్ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఊరి వేసుకున్నాడు. పొలానికి వెళ్లిన ఇతర కుటుంబ సభ్యులు సాయంత్రం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకోగా అప్పటికే శ్రీకాంత్ ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవుడయ్యాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి తెలిపారు.

అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

నూతనకల్ : బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. నూతన్‌కల్ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నూతన్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బిక్కి పృథ్వీ (17), శిగ సంతోష్ బైక్‌పై సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై వెళ్తున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ముందు వెళ్తున్న మరో బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో స్తంభం పృథ్వీ ఛాతికి బలంగా తాకడంతో తీవ్ర, సంతోష్ స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పృథ్వీ మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జాకూరి సైదులు తెలిపారు.

ముగిసిన సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్

- బాలుర విభాగంలో హైదరాబాద్.. బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్ల గెలుపు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర 33వ సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ టోర్నమెంట్ డే అండ్ నైట్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి హైదరాబాద్ జట్టు కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిని మేడ్చల్ జిల్లా గెలుచుకుంది. నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. అదే విధంగా బాలికల విభాగంలో ప్రథమ బహుమతిని రంగారెడ్డి జిల్లా జట్టు కైవసం చేసుకోగా కొత్తగూడెం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల జట్లు తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీను(ఫైల్)

పెద్దవూర: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. కట్టంగూర్ మండలం గర్నెకుంట గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గర్నెకుంటకు చెందిన చిట్టిమళ్ల శ్రీను(38) తన వ్యవసాయ భూమిలో మిరప పంటను సాగు చేశాడు. తన భార్య, చిన్న కుమారుడుతో కలిసి మిరప చేనులో నీరు కట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మోటార్ బంద్ కావడం, పక్కచేలలోని మోటార్లు పోస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజు పోవడాన్ని గమనించాడు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా పక్కనే ఉన్న తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలయ్యాయి. గమనించిన అతని భార్య జయమ్మ కేకలు వేయడంతో సమీప రైతులు వచ్చి అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఎస్‌ఎంఏఎం పథకం తెలంగాణలో వర్తింపజేయాలి

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి

కట్టంగూర్: కేంద్ర ప్రభుత్వం సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం) పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే, కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అడ్వయిజర్ నంద్యాల నర్సింహారెడ్డి కోరారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శికి ఎం.రఘునందన్‌రావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో డ్రోన్లు 80 శాతం సబ్సిడీపై దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మిగతా రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రానికి వర్తింపజేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఎంఏఎం పథకం తెలంగాణ రాష్ట్రంలో అమలయ్యేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై డీఈఓ విచారణ

హుజూర్‌నగర్‌రూరల్ : లెక్కలు రావడం లేదని విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు చితకబాదిన ఘటనపై సూర్యాపేట డీఈఓ అశోక్ సోమవారం హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విచారణ చేపట్టారు. చదువు సక్రమంగా రావడం లేదని వ తరగతి విద్యార్థి ప్రేమ్‌కుమార్ వీపుపై ప్రధానోపాధ్యాయుడు కాంతయ్య బెత్తంతో కొట్టినట్లు విచారణలో తేలిందన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

విజ్ఞాన సంపదను పంచడమే 'కూరెళ్ల' లక్ష్యం


సాయి సాహితీ సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్


కూరెళ్ల శతకం ద్వితీయ ముద్రణను ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్, సినీ గేయ రచయిత చంద్రబోస్, కలెక్టర్ జెండగే, విఠలాచార్య

- హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్

రామన్నపేట : భావితారాలకు విజ్ఞాన సంపదను పంచడమే ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం ఏర్పాటు ప్రధాన లక్ష్యమని హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ తెలిపారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం పై అంతస్తులో నిర్మించిన సాయి సమావేశ మందిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య రాసిన కూరెళ్ల శతకం ద్వితీయ ముద్రణను సినీ గేయ రచయిత కనుకుంట్ల సుభాస్‌చంద్రబోస్, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. చదువుకునేందుకు తాను పడిన ఇబ్బందులు ఇతరులకు ఎదురు కాకూడదని బాల్యంలో కూరెళ్ల మదిలో వచ్చిన ఆలోచన కూరెళ్ల గ్రంథాలయం ఏర్పాటుకు నాంది పలికిందని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ అనంతరం కూరెళ్ల ఇంటిని గ్రంథాలయంగా మలచి తన పింఛన్ డబ్బులతో నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. కూరెళ్లకు కూతుళ్లు అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో గ్రంథాలయ నిర్వహణకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కూరెళ్ల గ్రంథాలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ప్రముఖ సినీ గేయరచయిత కనుకుంట్ల చంద్రబోస్ మాట్లాడుతూ పరభాషా వ్యామోహంలోపడి మాతృభాషను మరువవద్దని కోరారు. కలెక్టర్ హనుమంతు కె. జెండగే మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఇద్దరు ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలు రావడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు, యువకులు పఠనాసక్తిని పెంచుకోవాలని చెప్పారు.

ప్రతీ పురస్కారం గ్రామానికే అంకితం

తనకు వచ్చిన ప్రతీ పురస్కారం గ్రామానికే అంకితమిచ్చినట్లు గ్రంథాలయ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన రూ.25లక్షల నగదు పురస్కారంతోపాటు మరో రూ.20లక్షలను సమకూర్చి గ్రంథాలయ నిర్వహణ నిధిని ఏర్పాటు చేస్తానని తెలిపారు. గవర్నర్‌చేతుల మీదుగా గ్రంథాలయంను ప్రారంభించుకోవడం తన జీవితంలో మరపురాని రోజు అని తెలిపారు.అంతకుముందు అతిథులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, గ్రంథాలయ అధ్యక్షుడు కూరెళ్ల నర్సింహాచారి, అధికార ప్రతినిధి కూరెళ్ల నర్మద సభ్యులు కూరెళ్ల తపతి, సరస్వతి గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి, తాజామాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎర్రోళ్ల లక్ష్మమ్మ,మహేందర్‌రెడ్డి, ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న సునీల్ శర్మ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎండోమెంట్ అండ్ ఎక్సైజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అంతకుముందు ఆచార్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల వద్ద ప్రత్యేక ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న సునీల్ శర్మకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం కొండపైనే గల శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రధానాలయ నిర్మాణ విశేషాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.


ఎండోమెంట్ అండ్ ఎక్సైజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

బాలల సంరక్షణ కేంద్రానికి ముగ్గురు పిల్లల తరలింపు

బొమ్మలరామారం : ఆలనా పాలనా మరిచిన ఓ తండ్రి ఒంటరిగా వదిలి వెళ్లిన ముగ్గురు పిల్లలను అధికారులు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. మేడ్చల్ జిల్లా కుషాయిగూడకు చెందిన హరిశంకర్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇతడికి భార్య, మధుసూదన్‌రెడ్డి, సాహితి, రాజేందర్ ముగ్గురు పిల్లలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఎనిమిది మాసాల క్రితం భార్య మృతిచెందడంతో హరిశంకర్‌రెడ్డి మద్యానికి బానిసగా మారాడు. ఆరు మాసాల క్రితం బతుకుదెరువు నిమిత్తం బొమ్మలరామారం మండల కేంద్రానికి వచ్చాడు. ఇక్కడే గదిని అద్దెకు తీసుకుని కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నాడు. గడిచిన నెలన్నర రోజులుగా హరిశంకర్‌రెడ్డి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరావడం లేదు. ఆలనాపాలనా చూసేవారు లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా స్థానికులే వారి బాగోగులు చూశారు. పిల్లల బాధ చూడలేక స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, శిశు సంక్షేమ శాఖ అధికారి హరిబాబు వచ్చి ముగ్గురు పిల్లలను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.


పిల్లలను బాలల సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని చత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు క్లబ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన నడ్డి వెంకటేష్, వేములపల్లి మండలం పాములపాడు గ్రామానికి చెందిన మొగిలి నగేష్ పాఠశాల నుంచి క్లబ్‌లో చేరి నిరంతర సాధన చేయడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ఇద్దరు క్రీడాకారులు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు.